ఇక్కడికి రానంటున్నారు!

- తాండూర్ మండల పరిషత్‌లో పోస్టులు ఖాళీ
- బదిలీపై వచ్చేందుకు అనాసక్తి



ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ కుర్చీ



తాండూర్ మండల పరిషత్ కార్యాలయం

తాండూర్: మండలానికి బదిలీపై రావడానికి ప్రభుత్వ ఉద్యోగులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో భాగంగా తాండూర్ మండలాన్ని ఎంచుకోలేకపోతున్నారు. ఇందుకు కారణాలేమిటో తెలియదు కానీ వారి అనాసక్తిపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎప్పుడు లేనివిధంగా ఇటీవల కాలంలో విముఖత చూపుతుండడం గమనార్హం.

నలుగురు బదిలీపై వెళ్లగా..

మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు ఇటీవల బదిలీపై వెళ్లారు. ఎంపీవో, కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ బదిలీ అయ్యారు. వీరిలో ఇప్పటివరకు వేరే ప్రాంతం నుంచి ఎంపీవో బదిలీపై వచ్చి విధుల్లో చేరగా మరో మూడుపోస్టులు ఖాళీగా ఉన్నాయి. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ ఖాళీ పోస్టులకు ఇతర ప్రాంతాల ఉద్యోగులు ఇప్పటివరకు ఎంపిక చేసుకోలేదు. ఉద్దేశపూర్వకంగానే ఎంపిక చేసుకోలేకపోతున్నారా మరీ కారణాలు ఉన్నాయో తెలియడం లేదు.

పనులు నిలిచిపోయే అవకాశం

ఏ శాఖకైనా సరిపడా ఉద్యోగుల అవసరం ఉంటుంది. పోస్టులు భర్తీ కాకుండా ఉండటం వల్ల ప్రజలకు పనులు సకాలంలో జరిగే అవకాశాలు ఉండవు. ప్రస్తుతం గ్రామాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో కిందిస్థాయి ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ముఖ్యమైన మూడు పోస్టులు భర్తీ కాకపోవడంతో సత్వరం పనులు జరిగేందుకు అవకాశాలు కనిపించడం లేదు. ఖాళీ పోస్టుల భర్తీకి అధికారులు తగిన చర్యలు తీసుకుని గ్రామీణులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..

ఉద్యోగుల ఖాళీల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం. సాధారణ బదిలీల్లో ఎవరు ఇక్కడికి పోస్టులు ఎంపిక చేసుకోని పక్షంలో డిప్యూటేషన్‌పై ఉద్యోగులను కేటాయించాలని విన్నవించాం. పాలన విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. – శ్రీనివాస్, ఎంపీడీవో

29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర



బెల్లంపల్లి: యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో యాత్ర పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లు వేలం వేయడానికి సిద్ధపడిందన్నారు. బెల్లంపల్లి శివారులోని శ్రావణ్‌పల్లి బ్లాక్‌ను వేలం పెట్టడం సరికాదన్నారు. తెలంగాణలో ఉన్న బొగ్గుబ్లాక్‌లన్నీ సింగరేణికి కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా బొగ్గు బ్లాక్‌ల సాధన కోసం ఈనెల 29 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు సింగరేణి పరిరక్షణ యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. 29న బెల్లంపల్లిలో బస్సు జాత ప్రారంభమవుతుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరై యాత్రను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం బెల్లంపల్లి మండల కార్యదర్శి జి.అశోక్, నాయకులు రమణ, రాజారాం , దేవదాస్ , రవీందర్, సంకీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: సింగరేణి పరిరక్షణ కోసం ఈనెల 29 నుంచి ఆగస్టు 5 వరకు సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని నాయకులు కోరారు.కొత్త బస్టాండ్ ప్రాంతంలో శనివారం యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాత్రకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాళ్లు సిడాం సమ్మక్క, బొర్ల సరిత, కరీమాలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

బెల్లంపల్లి: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆర్డీవో పి.హరికృష్ణ తెలిపారు. శనివారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో తాపీకార్మిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో జనహిత సేవా సమితి ముందుందన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు ఏడాదికి గరిష్టంగా మూడు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ ఈసారి 165 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారి కోసం రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు ఆర్డీవో సర్టిఫికెట్లు అందజేశారు. మున్సిపల్ కౌన్సిలర్ రాజలింగు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు శ్రీనివాస్, అభినవ సంతోష్‌కుమార్, కాసర్ల రంజిత్, జనహిత సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు



మంచిర్యాలటౌన్: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/లక్సెట్టిపేట: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ చేసిన అసత్య ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే రఘునాథ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమెరికా నుంచి టూరిస్టుగా వచ్చి, అప్పుడప్పుడు నియోజకవర్గంలో పర్యటిస్తే అభివృద్ధి గురించి ఏమి తెలుస్తుందని ప్రశ్నించారు. మరోసారి ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

- హాజీపూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట రవి మాట్లాడుతూ రఘునాథ్ ఆరోపణలను ఖండించారు. మాజీ ఎంపీటీసీలు బాపు, బాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ సత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస గౌడ్, మాజీ సర్పంచులు మహేందర్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.
- దండేపల్లి మండలంలోని చింతపల్లిలో శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆర్‌జీపీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడారు. బీజేపీ నేతలు సోషల్ మీడియా ద్వారా నిరాధారమైన ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, రాజేందర్, దుర్గాప్రసాద్, వెంగల్‌రావ్, వేణు, రమణ, రవి, రాకేశ్, మురళీ, నగేశ్ పాల్గొన్నారు.
- లక్సెట్టిపేట ఐబీ ఆవరణలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరీఫ్ మాట్లాడారు. బీజేపీ నాయకులు సోషల్‌మీడియాలో చేసిన ఆరోపణలను ఖండించారు. అశోక్, పి.రమేశ్, షాహిద్‌అలీ, శ్రీనివాస్, రాజన్న, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



రాళ్లవాగు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

మంచిర్యాలటౌన్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలోని హమాలివాడ రైల్వే అండర్‌బ్రిడ్జి, పోచమ్మ చెరువు మత్తడి నీరు 17వ వార్డులోని సీతారామ కాలనీ, బృందావన కాలనీలకు చేరింది. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు, రోడ్లు జలమయం అవుతున్నాయి. రాళ్లవాగు కాజ్‌వే పైనుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది.



17వ వార్డులో ఇళ్ల మధ్య చేరిన వరద నీరు

ఉప్పొంగిన నదులు



నక్కలపల్లి వెళ్లేదారిలో ఉప్పొంగిన వాగు

కోటపల్లి: భారీ వర్షాలకు ప్రాణహిత, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంటల్లోకి వరదనీరు చేరి నీట మునిగిపోయాయి. నక్కలపల్లి లోత్రాై వాగు ఉప్పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రాజారం దేవులవాడ గ్రామాల మధ్యవాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి.



అలుగామలో నీటమునిగిన పంటలు

వర్షాలు, వరదలతో అప్రమత్తంగా ఉండాలి

వేమనపల్లి: భారీ వర్షాలు, వరదల కారణంగా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సూచించారు. మండలంలోని పీహెచ్‌సీని శనివారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. వరద తీవ్రత అధికంగా ఉన్న రాచర్ల వెళ్లే రహదారి వద్దకు వెళ్లి పరిశీలించారు. ప్రజలు, గర్భిణులకు వైద్యసేవలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ముక్కిడిగూడం, జాజులపేట, సుంపుటం, కళ్లంపల్లి గ్రామాలకు వెళ్లేదారిపై నీటి ప్రవాహం దృష్ట్యా అప్రమత్తం చేశారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. సీహెచ్‌ఓ రాజారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ బాపు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

ఎడతెరిపి లేని వర్షం

జైపూర్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోడ్లు, పంట పొలాలు జలమయంగా మారాయి. చెరువుల్లో భారీ వరద నీరు వచ్చిచేరింది. కుందారం–కిష్టాపూర్ మధ్యన లోలెవల్ వంతెనపై నుంచి భారీగా వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



కుందారం–కిష్టాపూర్ మధ్య లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

విద్యుత్ స్తంభం పరిశీలన



స్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

చెన్నూర్: పట్టణంలోని శివాలయం రోడ్డులో 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' శీర్షికన సాక్షిలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి విద్యుత్ ఏడీ రవికుమార్, ఏఈ శ్రీనివాస్ స్పందించారు. విద్యుత్ స్తంభాన్ని పరిశీలించి ఎక్కడ ఏర్పాటు చేయాలని కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టాక కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని ఏడీ, ఏఈ తెలిపారు. పాదాచారులు, వాహనదారులు వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలను పట్టుకోవద్దని తెలిపారు.



దండేపల్లి: గుడిరేవు పాఠశాలలో..



కాసిపేట: ధర్మరావుపేట జెడ్పీ పాఠశాలలో..

పాఠశాలల్లో బోనాల వేడుకలు

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి/కాసిపేట: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల పోతురాజుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. నెత్తిన బోనం ఎత్తి, అమ్మవారికి పూజలు చేశారు. ఈసందర్భంగా వారి నృత్యాలు పలువురిని అలరించాయి.



మంచిర్యాలఅర్బన్: శ్రీ చైతన్య పాఠశాలలో..

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి: మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలన, యాంటీ ర్యాగింగ్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడారు. గంజాయి, గుట్కా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను పిల్లలు నెరవేర్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే హంగామా

జన్నారం: స్థానిక రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కళాశాలలో చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో హంగామా చేశారు. మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హాజీపూర్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసరావు దేశ్‌పాండే

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్‌గా శ్రీనివాసరావు దేశ్‌పాండే శనివారం బాధ్యతలు స్వీకరించారు. నాయబ్ తహసీల్దార్ హరిత, గిర్దావర్ మంగ, ప్రభులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పని చేసిన సతీశ్‌కుమార్ నస్పూర్ ఐడీఓసీలోని కలెక్టరేట్ ×ఈ౹విభాగం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

భీమారం పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా కృష్ణమూర్తి



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంపీవోలు

భీమారం: భీమారం గ్రామ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి శ్రీనివాస్ బదిలీయ్యారు. ఆయన స్థానంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో పనిచేస్తున్న కృష్ణమూర్తిని గ్రేడ్-1 కార్యదర్శిగా ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆయన్ను ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఎంపీవోలు బాపురావు, సతీశ్‌రెడ్డి సన్మానించారు. భీమారం పెద్ద గ్రామ పంచాయతీ నేపథ్యంలో గ్రేడ్-1 కార్యదర్శిని ప్రభుత్వం కేటాయించిందని ఎంపీడీవో తెలిపారు.

హిందూవాహిని సంఘటన్ జిల్లా అధ్యక్షురాలిగా లావణ్య



లావణ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హిందూవాహిని సంఘటన్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామం రాంపూర్‌కు చెందిన మడిపెల్లి లావణ్య నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు మద్దూరు భార్గవ రెడ్డి శనివారం నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

కేవీలో ప్లాంటేషన్ స్పెషల్ డ్రైవ్



మొక్కలతో తల్లులు, విద్యార్థులు, టీచర్లు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో శనివారం ప్లాంటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులకు తల్లి, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి తల్లికోసం మొక్క నాటాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

నస్పూర్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా పట్టణంలోని 15వ వార్డులో శనివారం ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, ఆర్‌ఐ డి. తిరుపతి, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాల్‌నగర్ జీపీ తనిఖీ

తాండూర్: మండలంలోని గోపాల్‌నగర్ పంచాయతీని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, పారిశుద్య పనుల తీరు పరిశీలించారు. మండల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంతకముందు తాండూర్ గ్రంథాలయ పరిసరాలను కార్మికులతో శుభ్రం చేయించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, పంచాయతీ కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రాధాన్యత లేని బడ్జెట్

పాతమంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన బడ్జెట్‌లో యువతకు ప్రాధాన్యత కల్పించలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో యువతకు నిరాశే మిగిలిందన్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఉపాధి కల్పనకు తీసుకుంటున్న చర్యలు లేవన్నారు. అనంతరం మంచిర్యాల పట్టణ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోటపల్లి ప్రదీప్, కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా నీలాల రమేశ్ ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్, గోరింటాకు వేడుక

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవం, ఫుడ్‌ఫెస్టివల్, గోరింటాకు వేడుక నిర్వహించారు. విద్యార్థులు ఆహార పదార్థాలను ప్రదర్శన చేశారు. విద్యార్థినులు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరీ, కృష్ణగోపాల్‌రావు, జ్యోతి, మాధవిలత, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

'ఏఐటీయూసీపై ఆరోపణలు సరికాదు'

కాసిపేట: ఈనెల 25న బాయిబాటలో భాగంగా కాసిపేట గనిపై ఐఎన్‌టీయూసీ నాయకుడు దేవిభూమయ్య ఏఐటీయూసీపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ పేర్కొన్నారు. కాసిపేట గనిపై శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ఇక్కడి నుంచి డెప్యుటేషన్‌పై మందమర్రికి వెళ్లి కార్మికులకు పని భారం పెరుగుతుందని చెప్పడాన్ని ఏఐటీయూసీ ఖండిస్తుందన్నారు. గని ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

చెన్నూర్‌రూరల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రించవచ్చునని ఎస్సై శ్వేత పేర్కొన్నారు. మండలంలోని కత్తెరసాల గ్రామంలో సీసీ కెమెరాలపై శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రధాన రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, తగిన సూచనలు పాటించాలన్నారు.

30న స్పాట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఎంఈసీ గ్రూప్‌లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 30న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నిరుపమ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంఈసీ గ్రూప్‌లో ఎస్సీ విద్యార్థినులతో ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన ఎస్సీ బాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్సీలకు కేటాయించాలి

దండేపల్లి: పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు చేస్తున్న నేపథ్యంలో ఏజెన్సీ గ్రామాల రిజర్వేషన్ల పై ప్రభుత్వం దృష్టిసారించాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోళ్ల రాజమల్లు కోరారు. దండేపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయని, వాటిల్లో సర్పంచ్ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని, గిరిజనులు ఉన్న చోట మాత్రం వార్డు స్థానాల్లో ఎస్సీలకు అవకాశం కల్పించాలన్నారు.

రోడ్డుకు మరమ్మతు

కాసిపేట: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మందమర్రి ఏరియా కాసిపేట–1, 2 గనులకు వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలకు శనివారం మరమ్మతు చేపట్టారు. డ్యూటీకి హాజరయ్యే కార్మికులకు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏఐటీయూసీ నాయకులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి జీఎం సివిల్ డిపార్ట్‌మెంట్‌కు ఆదేశించడంతో రోడ్డుకు మరమ్మతు చేపట్టినట్లు ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి మల్లేశ్ తెలిపారు. కాసిపేట గని ఫిట్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, నాగేశ్వర్ రావు, రంజిత్, శ్రీహరి, రాజేందర్, రవీందర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రానికి వెళ్లాలంటే సబ్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. కాంగ్రెస్ నాయకుడు కన్నెపల్లి మాజీ ఉపసర్పంచ్ గడ్డల వెంకటేశ్, బూరుకుటి లక్ష్మణ్ స్పందించి కొంతమంది నాయకులు కలిసి గుంతలను పూడ్చివేయించారు.

నీరు నిలుస్తున్నాయంటూ ఆందోళన

రామకృష్ణాపూర్:క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగడి సాయికుటీర్ ఏరియాలో ఇళ్ల ముందు నుంచి మురుగునీరు పారక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు కాలనీవాసులు శనివారం ఆందోళన చేపట్టారు. కాలనీలో కొందరు కాలువను కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టినందునే సమస్య తలెత్తుతుందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

కరపత్రాలు విడుదల

చెన్నూర్: మంచిర్యాలలో ఆగస్టు 7,8 తేదీల్లో జిల్లా స్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ చెన్నూర్ ఇన్‌చార్జి నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక బీసీ వసతి గృహంలో శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, అరవింద రెడ్డి, నాయకులు సాయికిరణ్, ప్రణయ్, సాయి కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల పరిశీలన

చెన్నూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని 5వ వార్డు, 12వ వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను మున్సిపల్ కమిషనర్ గంగాధర్ శనివారం పరిశీలించారు. వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు ఉన్నారు.

వసతి గృహాల్లో పిచికారీ

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో దోమల నివారణకు వైద్య సిబ్బంది శనివారం పిచికారీ చేశారు. వైద్యాధికారి రమేశ్, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.